క్లుప్తంగా

రికార్డుల పరిశీలన

పార్వతీపురం రూరల్: గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి సంబంధించిన రికార్డులను విజిలెన్స్ అధికారులు పార్వతీపురం ఎంపీడీఓ కార్యాలయంలో, మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నిబంధనల మేరకు క్రీడల నిర్వహణ, పాల్గొన్న విద్యార్థులు, విడుదలైన నిధుల వినియోగంపై సంబంధిత అధికారులను ఆరా తీశారు. పరిశీలన అనంతరం నివేదికను ప్రభుత్వానికి పంపనున్నట్లు పేర్కొన్నారు.

వీధి బోరే దిక్కు



వీధి బోరు వద్ద కంచాలను శుభ్రం చేస్తున్న చిన్నారులు

పార్వతీపురం రూరల్/పార్వతీపురం: జిల్లా కేంద్రంలోని జగన్నాథపురం ప్రాంతంలో ఉన్న ప్రాథమిక పాఠశాల విద్యార్థులు మధ్యాహ్న భోజనం అనంతరం కంచాలను శుభ్రం చేసుకునేందుకు పాఠశాల ఆవలవైపు వీధిరోడ్డుపై ఉన్న బోరు వద్దకు వెళ్లాల్సి వస్తోంది. పాఠశాల ఆవరణలో మౌలిక సదుపాయాలు సక్రమంగా లేని కారణంగా చిన్నారులు ఈ విధంగా అవస్థలు పడుతున్న దృశ్యాలను సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది.

విద్యార్థులకు అవగాహన



మత్తు పదార్థాల నివారణపై పోస్టర్లను ఆవిష్కరిస్తున్న విద్యార్థులు, ఈగల్ బృందం సభ్యులు

పార్వతీపురం రూరల్: మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై జిల్లా ఈగల్ బృందం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో డ్రగ్స్, మత్తు పదార్థాలు వినియోగిస్తే బంగారు భవిష్యత్తు పాడవుతుందని విద్యార్థులకు హితవు పలికారు. వాటిని నిరోధించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు వివరించి ఎవరైనా డ్రగ్స్ వినియోగించినా, విక్రయాలు చేసినా 1972 నంబర్‌కు తెలియజేయాలని విద్యార్థులను కోరారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఈగల్ సభ్యులు మత్తు పదార్థాల నివారణపై పోస్టర్లను ఆవిష్కరించారు.

అధిక దిగుబడి వచ్చే విత్తనాల పంపిణీ



మాట్లాడుతున్న ఏఓ ఎస్.అవినాష్

సీతానగరం: ఖరీఫ్ సీజన్‌లో అధిక దిగుబడులు, తెగుళ్లను తట్టుకునే వరి విత్తనాలను రైతులకు పంపిణీ చేసినట్లు ఏఓ ఎస్.అవినాష్ తెలిపారు. ఈ మేరకు మండలంలోని వెన్నెల బుచ్చింపేటలో మంగళవారం జరిగిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైతులకు గ్రామీణ విత్తనోత్పత్తి పథకంలో భాగంగా బీపీటీ-2846 రకం విత్తనాలను రాయితీపై అందజేశామన్నారు. దీనిపంట కాలం 145 నుంచి 150 రోజులని, 50 బస్తాల దిగుబడి వస్తుందని చెప్పారు. సన్నబియ్యం కావడంతో తినడానికి అనుకూలంగా ఉంటుందని, అగ్గి తెగ్గులు, మెడవిరుపు తెగులును తట్టుకుంటుందని తెలియజేశారు. కార్యక్రమంలో అంటిపేట సర్పంచ్ జి.తిరుపతిరావు, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కొనుగోలు చేసిన విత్తనాలకు రశీదులు తీసుకోవాలి

పాచిపెంట: రైతులు లైసెన్స్ ఉన్న దుకాణాల్లో విత్తనాలు కొనుగోలుచేసుకుని బిల్లులు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు జె.మణికుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ లైసెన్సులు లేకుండా గ్రామాలకు వచ్చి పత్తి, మొక్కజొన్న విత్తనాలు అమ్మేవారి దగ్గర విత్తనాలు కొనవద్దని హితవు పలికారు. నకిలీ విత్తనాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మండలంలో ఎస్టీ కుల ధృవీకరణ పత్రాల జారీ విషయంలో రెవెన్యూ అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఏమైనా తప్పిదాలు జరిగితే కలెక్టర్ దృష్టిలో పెట్టి వారిపై చర్యలు తీసుకోనున్నామని హెచ్చరించారు.

కూటమి పాలనపై పుస్తకావిష్కరణ



సీతానగరం: పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సీతానగరం:

రాష్ట్రంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి బంగారు భవిష్యత్ ఇచ్చిందని, చంద్రబాబు పాలన విధ్వంసకర పరిస్థితులు సృష్టిస్తోందని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బలగ శ్రీరాములునాయుడు అన్నారు. ఈ మేరకు మండల వైఎస్సార్‌సీపీ కార్యాలయం ఆవరణలో మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు సూచనల మేరకు కూటమి ఏడాది పాలనపై జగన్ అంటే నమ్మకం-చంద్రబాబు అంటే మోసం పుస్తకావిష్కరణ కార్యక్రమం మంగళవారం జరిగింది. అనంతరం వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మాట్లాడుతూ గడిచిన ఏడాది పాలనలో రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటు పొడిచిన కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్ రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన రాజ్యాంగం పేరుతో ఒక అరచకాన్ని సృష్టించారన్నారు. వైఎస్ జగన్ పాలన అంటే ప్రజల్లో నమ్మకం ఉదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎస్.రామకృష్ణ, యువజన విభాగం జిల్లా, మండల నాయకులు డాక్టర్ అంబటి కృష్ణం నాయుడు, ఎంపీటీసీలు వెంకటరమణ, అక్కపోలు సింహాచలం, ఆర్వీ కిశోర్, గుల్ల శంకరరావు వై.శ్రీనివాస్, కె.శ్రీనివాస్ బి.ముకుందరావు, బి.సూర్యనారాయణ, శంకర్రావు, వెంకటరమణ, తిరుపతిరావు, బొన్నా శివకుమార్ ముని మన్మథరావు పాల్గొన్నారు.

అరాచకాలే తప్ప అభివృద్ధి లేదు

పార్వతీపురం రూరల్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలనలో అరాచకాలే తప్ప అభివృద్ధి లేదని వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం పార్వతీపురం మండల కేంద్రంలో స్థానిక నాయకులతో కలిసి జగన్ అంటే నమ్మకం.. బాబు అంటే మోసం అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కులం, మతం, ప్రాంతం మరే ఇతర భేదాలు లేకుండా ప్రజల ఇంటి వద్దకే సంక్షేమాన్ని అందించి సచివాలయ వ్యవస్థ ద్వారా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని ఏర్పాటు చేసే విధంగా అనేక సంస్కరణలు చేసిన ఘనత ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిదేనన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో అన్యాయాలు, అరాచకాలు, కుల, మత, పార్టీల భేదాలతో రాజకీయాలు చేస్తూ సంక్షేమమనే మాట లేకుండా పరిపాలన చేస్తున్న ఘనత ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబుదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మువ్వల సత్యంనాయుడు, అనుబంధ విభాగాల అధ్యక్షులు బలగ నాగేశ్వరరావు, మడక విశ్వనాథం, వై. తిరుపతిరావు, బి.వాసుదేవరావు, మజ్జి శేఖర్, వైస్ఎంపీపీలు ఎస్. జగన్నాథం, బి.రవికుమార్, ఎంపీటీసీ వై.రమణ, చింతల ప్రసాద్, బి.వెంకటరమణ, జి.రమేష్, బి.కోటినాయుడు, కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పార్వతీపురం రూరల్: జగన్ అంటే నమ్మకం..బాబు అంటే మోసం పుస్తకాన్ని ఆవిష్కరించిన వైఎస్సార్‌సీపీ నాయకులు

సీఎం నియోజకవర్గంలోనే మహిళలకు రక్షణ కరువు

సాలూరు:

రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలోనే మహిళలకు రక్షణ కరువవుతోందని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు రెడ్డి పద్మావతి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ఎటుచూసినా చిన్నా పెద్దా తేడా లేకుండా మహిళలపై అత్యాచారాలు, హత్యలు, దాడులు, దౌర్జన్యాలు జరుగుతున్నాయని వాపోయారు. చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో ఓ మహిళను చెట్టుకు తాళ్లతో కట్టేసి చిత్రహింసలకు గురిచేసి న సంఘటన ప్రస్తుత పాలనకు అద్దం పడుతోందన్నారు. బాధిత మహిళను నేరుగా కలిసి అండగా నిలవాల్సిన హోంమంత్రి అలాకాకుండా కేవలం వీడియో కాల్ చేసి పరామర్శించడం శోచనీయమన్నారు.

రాష్ట్రంలో హోంమంత్రిగా ఓ మహిళ ఉన్నప్పటికీ, రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందని విమర్శించారు. రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడులను వైఎస్సార్‌సీపీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఇకనైనా కూటమి ప్రభుత్వం అంబేడ్కర్ రాజ్యాంగం అమలు చేసి మహిళలు, ప్రజలకు రక్షణ కల్పించాలని కోరారు.

'ఆశ'ల సమస్యలు పరిష్కరించాలి

- కనీసవేతనం రూ.26 వేలు ఇవ్వాలి
- జూలై 9న దేశవ్యాప్త సమ్మె
- వైద్యశాఖ అధికారులకు సమ్మె నోటీసు అందజేత



జిల్లా వైద్యశాఖ కార్యాలయం సూపరింటెండెంట్ కామేశ్వరరావుకు సమ్మె నోటీసు అందజేస్తున్న సీఐటీయూ నాయకులు, ఆశ వర్కర్లు

పార్వతీపురంటౌన్: ఆశ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా నాయకురాలు వి.ఇందిర డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఏపీ ఆశవర్కర్స్ పార్వతీపురం యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా వైద్యశాఖ కార్యాలయం సూపరింటెండెంట్ కామేశ్వరరావుకు సమ్మెనోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశ వర్కర్లను కార్మికులుగా గుర్తించి, కనీసవేతనం రూ.26 వేలు ఇవ్వాలి. కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్‌ను ఆశ కార్యకర్తలుగా మార్చుచేయాలి. ఒప్పంద జీఓలు విడుదలచేయాలి. నియామకాలు ప్రభుత్వమే చేపట్టాలి. లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్స్ పరిష్కారం కోసం కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు జూలై 9న జరగనున్న దేశవ్యాప్త సమ్మెలో ఆశ వర్కర్స్ అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ప్రధాన డిమాండ్లు ఇవే..

- లేబర్ కోడ్స్ రద్దుచేయాలి. కార్మిక చట్టాలను పటిష్ఠ పరచాలి
- కనీస వేతనం ఇవ్వాలి. కార్మికులుగా గుర్తించి, పర్మినెంట్ చేయాలి
- కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్‌ని ఆశ కార్యకర్తలుగా మార్చాలి
- ఒప్పంద జీఓలు ఇవ్వాలి
- చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలి
- నియామకాలు ప్రభుత్వమే చేపట్టాలి
- సంక్షేమ పథకాలు అమలుచేయాలి
- ఆరోగ్య రంగానికి జీడీపీలో 8శాతం నిధులు కేటాయించాలి
- ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, అమ్మకం ఆపాలి. ప్రజా సంపదను కాపాడాలి.
- 10 లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని సమ్మెనోటీసులో పేర్కొన్నారు.

కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గొర్లి వెంకటరమణ, శివాని తదితరులు పాలొన్నారు.

రైతులు విత్తనాలను తయారు చేసుకోవాలి



అరసాడలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ శ్రావణ్‌కుమార్

బలిజిపేట: రైతులు విత్తనాలను తయారుచేసుకుని నిల్వ చేసుకుని సాగుకు వాడాలని ఏఓ శ్రావణ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు మండలంలోని అరసాడలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విత్తనోత్పత్తిపై రైతులకు అవగాహన కల్పించారు. అదే విధంగా భూ సాగుదారు హక్కు పత్రాల గురించి తెలియజేశారు. వాటివల్ల ఇన్‌పుట్ సబ్సిడీ, ప్రభుత్వ పథకాలు అమలవుతాయని చెప్పారు. కంది విత్తనాలను రైతులు గట్లపై వేసుకోవడం వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. నవధాన్యాల విశిష్టతను తెలిపారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సిబ్బంది మాట్లాడుతూ నీలి నాలుక, జబ్బవాపు వ్యాధికి వ్యాక్సినేషన్ జరుగుతోందని పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్యాంగ హక్కులపై దాడిని నిరోధించాలి



సెమినార్‌లో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మన్మథరావు

బలిజిపేట: విద్యార్థులు మంచి విద్యను అభ్యసించాలి. ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలి. అందుకు మనకు రాజ్యాంగం కల్పించిన హక్కులను మనం కాపాడుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి మన్మథరావు పిలుపునిచ్చారు. ఆలిండియా మహా సభల సందర్భంగా బలిజిపేట మండలంలోని వెంగాపురం పీఎస్ఎన్ కళాశాలలో ఏర్పాటు చేసిన సెమినార్‌లో ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం అందరికీ విద్యా హక్కు కల్పించింది. ప్రభుత్వ రంగంలో ఉద్యోగ రిజర్వేషన్ కల్పించింది. ప్రాథమిక హక్కులు కల్పించింది. అటువంటి హక్కులపై దాడి జరుగుతోందని, మన హక్కులు హరించేందుకు ప్రభుత్వాలు కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. ప్రాథమిక విద్యను కేంద్రం తన చేతుల్లోకి తీసుకుంది. ప్రాథమిక విద్యను ముక్కలు చేసిందన్నారు. జాతీయ విద్యావిధానంలో భాగంగా కుట్రలను అమలు పరుస్తోందని, అందుకు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం సహకరిస్తోందని, హక్కులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అఖిల్, ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పించి బిల్లులు చెల్లించాలి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం, రైతు సంఘం నాయకులు

సీతానగరం: రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ కూలీలు, చిన్న, సన్నకారు రైతాంగానికి ఉపాధి పనులు కల్పించాలని, తక్షణమే ఉపాధి బిల్లు బకాయిలు చెల్లించాలని సీపీఎం జిల్లా కమిటీ నాయకుడు రెడ్డి వేణు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్‌కు జిల్లా వ్యవసాయ కార్మికసంఘం కార్యదర్శి రెడ్డి లక్ష్మునాయుడు ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆరు వారాలుగా బకాయిల చెల్లింపు చేయాలని, వేతన దారులకు 200 రోజులు పనులు కల్పించాలని, రోజుకు రూ.600 వేతనం చెల్లించాలని కోరారు. ఉపాధి బిల్లులు వేశామని ప్రకటించిన ప్రభుత్వం రెండు వారాలైనా బ్యాంకులకు జమ చేయకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు తప్పక అప్పుల కోసం వేతనదారులు తిరగాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రెడ్డి ఈశ్వరరావు జవర వెంకటరమణ, రెడ్డి రమణమూర్తి, ఎం. రాఘవ, రెడ్డి శ్రీను, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణమూర్తికి మాజీ ఎమ్మెల్యే నివాళి



కృష్ణమూర్తి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం రూరల్: మండలంలోని ములగ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు భీమవరపు కృష్ణమూర్తి ప్రథమ వర్ధంతిని కుటుంబసభ్యులు స్వగ్రామంలో ఏర్పాటు చేయగా మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు మండల నాయకులతో కలిసి వెళ్లి ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. స్థానిక నాయకులు, కుటుంబసభ్యులు, కార్యకర్తలతో కలిసి పార్టీతో కృష్ణమూర్తికి ఉన్న జ్ఞాపకాలను గుర్తుచేసు కున్నారు. కార్యక్రమంలో కుటుంబసభ్యులు ప్రసాద్, సూర్యనారాయణ, దామోదర్, పార్టీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మరమ్మతులు వేగవంతం చేయాలి



డీఈ అప్పాజీతో చర్చిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

సీతానగరం: మండలంలో మరమ్మతులకు గురైన బీటీరోడ్డు, బ్రిడ్జి పనులు వేగవంతం చేయాలని సంబంధిత ఆర్అండ్‌బీ అధికారులను ఎమ్మెల్యే బి.విజయచంద్ర ఆదేశించారు. ఈ మేరకు మండలకేంద్రంలో జరుగుతున్న బ్రిడ్జి పనులు, అప్పయ్యపేట-సీతానగరం గ్రామాల మధ్య నున్న బ్రిడ్జిపై ఏర్పడిన గోతులను మంగళవారం ఆర్అండ్‌బీ డీఈ అప్పాజీతో కలిసి ఎమ్మెల్యే విజయచంద్ర పరిశీలించారు. రూ.12 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను పరిశీలించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పాత బ్రిడ్జి తరచూ మరమ్మతులకు గురవుతుండడంతో నూతనంగా నిర్మాణం చేస్తున్న బ్రిడ్జి పనులు వేగవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ జె.తేరేజమ్మ, ఉప సర్పంచ్ అరవింద్‌కుమార్, మాజీ ఎంపీటీసీ ఎస్.శ్రీనివాసరావు, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇష్టానుసారం వాహనాల నిలుపుదల



పట్టణ ప్రారంభంలో అంతర్రాష్ట్ర రహదారిపై నిలుపుదల చేసిన లారీ

పార్వతీపురం రూరల్: జిల్లా కేంద్రంలో పట్టణ మధ్యభాగంలో నుంచి ఉన్న అంతర్రాష్ట్ర రహదారి ఇప్పటికే వసతులు లేక ఇరుకు మార్గంగా భారీ నుంచి అతిభారీ వాహనాల రాకపోకలకు తీవ్రస్థాయిలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. అయితే కొంతమంది భారీ వాహనాలను ఎక్కడ పడితే అక్కడ గంటల తరబడి నిలిపివేస్తున్న క్రమంలో అంతర్రాష్ట్ర రహదారిపై సగభాగాన్ని నిలుపుదల చేసిన వాహనాలు ఆక్రమించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందని తోటి వాహన దారులు వాపోతున్నారు. పట్టణానికి శివారురులో రహదారిని ఆనుకొని ఉన్న ప్రదేశాల్లో కానీ లేదా అవసరమైతే పెట్రోల్ బంకుల వద్ద ఉన్న ఖాళీ స్థలాల్లో కానీ పార్కింగ్ చేయాల్సిన వాహనాలను ఈ విధంగా బాధ్యతా రాహిత్యంగా రోడ్డుపై నిలిపివేస్తుండడం సరికాదని ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో ప్రమాదాలు జరగడమే కాకుండా ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందని చెబుతున్నారు.

తల్లికి వందనంపై నూతన జీఓ అమలు చేయాలి



పార్వతీపురంటౌన్: మున్సిపల్ కమీషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు



సాలూరు: వినతిపత్రాన్ని అందిస్తున్న నాయకులు

పార్వతీపురంటౌన్: తల్లికి వందనం వర్తింపుపై నూతన జీఓ నంబర్ 26ను అమలు చేయాలని సీఐటీయూ నాయకుడు గొర్లి వెంకటరమణ కోరారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లికి వందనం పథకానికి మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల ఆదాయ పరిమితిని మినహాయిస్తూ జీఓఎంఎస్ నంబర్ 26లో ఉందన్నారు. దీని ఆధారంగా పారిశుద్ధ్య కార్మికులకు తల్లికి వందనం పథకం అమలు జరిగేలా చూడాలని కోరారు. మున్సిపల్ సి అండ్ డీఏంఏ మున్సిపల్ కమిషనర్లకు, రీజనల్ డైరెక్టర్లకు రాసిన ఉత్తర్వులకు అనుగుణంగా అందరికీ అనుమతించాలన్నారు. సీఐటీయూ పట్టణ నాయకులు బంకురు సూరిబాబు, పారిశుద్ధ్య కార్మికులు కలిసి జీఓ కాపీని మున్సిపల్ కమిషనర్‌కు అందజేశారు. కార్యక్రమంలో పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల పిల్లలకు వర్తింపచేయాలి

సాలూరు: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన తల్లికి వందనం పథకం మున్సిపల్ కార్మికుల పిల్లలకు వర్తింపచేయాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు రాముడు, శంకరరావు కోరారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణకు వినతిపత్రం అందించారు. పారిశుద్ధ్య విభాగంలో పనిచేస్తున్న కార్మికులందరికీ తల్లికి వందనం పథకంలో అర్హులవాలంటే మున్సిపల్ అధికారులు ధృవీకరించి సహకరించాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ కార్యదర్శుల నియామకం

పార్వతీపురం రూరల్: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అనుబంధ విభాగాల కమిటీ కార్యదర్శులుగా పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన పలువురిని పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు నియమించారు. ఈ మేరకు మంగళవారం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.

హోదా	పేరు	నియోజకవర్గం
రాష్ట్ర ఎస్టీసెల్ సెక్రటరీ	అలూరి రామకృష్ణ	పార్వతీపురం
రాష్ట్ర ఎస్టీ సెల్ జాయింట్ సెక్రటరీ	తోయక గోపాల్	కురుపాం
రాష్ట్ర అంగన్వాడీ విభాగ సెక్రటరీ	డొంకాడ దేవి	పార్వతీపురం
రాష్ట్ర సాంస్కృతిక విభాగ సెక్రటరీ	రౌతు విజయ్‌కుమార్	కురుపాం
రాష్ట్ర సాంస్కృతిక విభాగ సెక్రటరీ	చందాన శివాజీ	పార్వతీపురం

ప్రమాదం జరిగితే కానీ పట్టించుకోరా?



శిథిలమైన రహదారిపై రక్షణ గోడ

పార్వతీపురం రూరల్: జిల్లా కేంద్రం శివారులో ఉన్న అంతర్రాష్ట్ర రహదారిపై కల్వర్టు శిథిలావస్థకు చేరింది. గత ఏడాది కురిసిన వర్షాలకు సగభాగం కుంగిపోవడంతో ప్రమాదాలు జరగకుండా కుంగిపోయిన భాగంలో రహదారిపై ఆర్అండ్‌బీ అధికారులు గోడను నిర్మించారు. అయితే సోమవారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఆ గోడను ఢీకొట్టడంతో రక్షణగా ఉన్న గోడ కాస్త శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. ఈ కల్వర్టు నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు కొంతమేరకు డైవర్షన్ రోడ్డు పనులు ప్రారంభించి విద్యుత్ లైన్ల మళ్లింపు నెపంతో అర్ధాంతరంగా పనులు నిలిపివేశారు. ఈ నేపథ్యంలో నిత్యం భారీ వాహనాలతో పాటు విద్యార్థులు, ఉద్యోగులు, ఎంతోమంది రాకపోకలు సాగిస్తున్న ఈ రహదారిపై నిర్మాణాలను పూర్తి చేయకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తీరును ప్రజలు, వాహన దారులు తప్పుబడుతున్నారు.

మరుభూమిలో మౌలిక సదుపాయాలేవీ?



శ్మశాన వాటికకు వెళ్లే దారిని చూపిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

పార్వతీపురం: జిల్లా కేంద్రం పరిధిలో ఉన్న శ్మశాన వాటికపై అధికారులు, పాలకులు శ్రద్ధ చూపాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలోని బైపాస్ రోడ్డు సమీపంలో ఉన్న శ్మశాన వాటికను ఆ పార్టీనాయకుడు వి.దాలినాయుడు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్మశానాలకు వెళ్లేందుకు దారి లేక అవస్థలు పడుతున్న పరిస్థితి నెలకొందన్నారు. అంతేకాకుండా వర్షాలు కురిస్తే దారులు జలమయమై వెళ్లలేని విధంగా మారుతున్నాయన్నారు. అలాగే కడసారి సాగనంపేందుకు వచ్చిన కుటుంబసభ్యులు స్నానాలు ఆచరించేందుకు సదుపాయాలు, శ్మశానం చుట్టూ ప్రహరీ, శ్మశానంలో వేచి ఉండేందుకు గది వంటి ప్రాథమిక సదుపాయాలు లేవన్నారు. స్థానిక కౌన్సిలర్లు సైతం ఈ సమస్య పరిష్కారానికి కృషి చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, అధికారంలో ఉన్న పాలకులు దృష్టిసారించి సమస్యలు పరిష్కరించాలని కోరారు.